
సాక్షి
చిత్తూరు
ఆదివారం । 8 । జూన్ । 2025



దిగాలుగా మామిడి

జిల్లాలో మామిడి రైతులు దిగాలు చెందుతున్నారు. ధరలు లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. - 10లో



ఏనుగుల బీభత్సం

పలమనేరు మండలం. ఊసరపెంటలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. మామిడి తోటలను సర్వనాశనం చేశాయి. - 10లో



అత్యాధునికంగా అలిపిరి టోల్

తిరుపతి అలిపిరి టోల్‌ప్లాజాను అత్యాధునికంగా తీర్చిదిద్దనున్నట్టు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

బోయకొండలో యోగాంధ్ర రేపు



బోయకొండలో యోగాంధ్ర నిర్వహించే ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్లు

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ వద్ద సోమవారం తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పర్యటకశాఖాధికారిణి గౌరి, సీఐ రాంభూపాల్, తహసీల్దార్ హనుమంతు నాయక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యాటక ప్రాంతాల్లో ఇదివరకే పులిగుండు, కాణిపాకం వద్ద విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు బోయకొండ వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

యోగాంధ్ర నిర్వహణ ప్రదేశాన్ని వివిధ శాఖల అధికారులు సందర్శించారు. గోశాల వద్ద మట్టిని తోలి చదును చేసే పనులు చురుగ్గా చేపట్టారు.

సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్‌పై కేసు

చిత్తూరు అర్బన్: సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కే.చిన్నయ్య పై చిత్తూరు పోలీసులు శనివారం క్రిమినల్ కేసు నమోదు చేశారు. సీఐ మహేశ్వర కథనం మేరకు... చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చిన్నయ్య కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడు. ఆ సమయంలో అందజేసిన పలు సర్టిఫికెట్లు తప్పుడువని, అలాగే హెల్త్ అసిస్టెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతులు పొందడానికి అందజేసిన ఇతర సర్టిఫికెట్లు తప్పుడువని .. ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు చిన్నయ్యపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. కాగా చిన్నయ్య చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి డిప్యూటేషన్ పై సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ నియమితులై పనిచేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వ దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయి, క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 72,174 మంది స్వామివారిని దర్శించుకోగా 35,192 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారి హుండీలో రూ.2.88 కోట్లు సమరిర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్




జిల్లా వ్యాప్తంగా బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం ఉదయం మసీదులు, ఈద్గాల వద్దకు చేరుకున్నారు. అల్లాహ్‌ను స్మరిస్తూ ఈద్‌ఉల్ జుహా అనే ప్రత్యేక నమాజ్‌ను చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సోదర భావాన్ని చాటుకున్నారు. పేదలకు శక్తి మేరకు దానధర్మాలు చేశారు. - పలమనేరు

పెద్ద శేష వాహనంపై చిద్విలాసం



అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు రాత్రి 7 గంటలకు పెద్ద శేష వాహనంపై శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. - వడమాలపేట (విజయపురం)

తెప్పోత్సవం..భక్తజన పరవశం



తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి తెప్పోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారు పద్మసరోవరంలో తెప్పపై మూడు చుట్లు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. - చంద్రగిరి

అయ్యోర్లు బదిలీ!

కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ గందరగోళంగా మారింది. ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో సీనియారిటీ జాబితాల్లో అవకతవకలు, బదిలీల కసరత్తులో నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు రావడం విమర్శలకు తావిస్తోంది. ప్రిఫరెన్షియల్ కేటగిరీ నమోదు చేసుకున్న టీచర్లకు దూరంగా పోస్టింగ్‌లు ఇవ్వడం, కొందరికైతే బదిలీల ఉత్తర్వులు జారీచేయకపోవడం కన్నీళ్లు తెప్పిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న బదిలీల కసరత్తుపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..



చిత్తూరు డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బదిలీల్లో నష్టపోయిన టీచర్లు

ముప్పతిప్పలు పెడుతున్న కూటమి ప్రభుత్వం

- నిబంధనలకు విరుద్ధంగా బదిలీల ఉత్తర్వులు
- ఎస్జీటీలకు హ్యాండిచ్చిన వైనం
- రాష్ట్ర విద్యాశాఖ అధికారులను వెళ్లి అడగండంటూ నిర్లక్ష్య సమాధానం
- ఆప్షన్ల బాయ్‌కాట్‌కు పిలుపునిచ్చిన ఐక్య ఉపాధ్యాయ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అయ్యోర్లకు వేసవి సెలవుల ప్రారంభం నుంచే బదిలీలు, ఉద్యోగోన్నతుల కసరత్తు మొదలైంది. ఈ కసరత్తు వేసవి సెలవులు పూర్తి కావొస్తున్నా ఇంత వరకు పూర్తికాని దుస్థితి నెలకొంది. విద్యాశాఖ అధికారుల వద్ద ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా సరిగా లేకపోవడం, ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన బదిలీల్లో దరఖాస్తుల నమోదు దగ్గర నుంచి బదిలీల ఉత్తర్వుల జారీ అయ్యే వరకు అన్నీ సమస్యలే ఎదురవడం అయ్యోర్లకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లు నిత్యం చిత్తూరు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తోంది. సమస్యలు విన్నవిస్తున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



పేరుకే నిబంధనలు

టీచర్ల బదిలీల కసరత్తుకు జారీచేసిన జీవోలు, నిబంధనలు పేరుకు మాత్రమేనని టీచర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. కసరత్తు మొత్తం విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారంగా, గందరగోళంగా నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు. బదిలీల్లో నిబంధనల ప్రకారం వారికి నమోదయ్యే పాయింట్ల ప్రకారం వెబ్ ఆప్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నా ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు.

క్రిమినల్ కేసులు పెడతామని బెదిరింపులు

బదిలీల్లో అవకతవకలు, సమస్యలు పరిష్కరించాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు మిన్నకుండిపోతున్నారు. దీనికితోడు 'రాష్ట్ర విద్యాశాఖ అధికారులను వెళ్లి అడగండి'.. అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నట్టు అయ్యోర్లు ఆరోపిస్తున్నారు. బదిలీలు ఆన్‌లైన్ విధానంలో జరిగాయి.. మాకు ఎలాంటి సంబంధం లేదు అంటూ చేతులు పైకెత్తేస్తున్నట్టు సమాచారం. గట్టిగా అడిగితే వారిపై క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగుతున్నట్టు తెలుస్తోంది. సీఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో జరుగుతున్న ఈ తతంగంపై క్షేత్ర స్థాయిలో అయ్యోర్లు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఇదేందయ్యా లోకేశం!

బదిలీల్లో అవకతవకలు, గందరగోళంపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లు, నాయకులు విద్యాశాఖ మంత్రి లోకేష్ సారూ.. ఇవేం బదిలీలయ్యా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ఇచ్చిన నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారమే ఎస్జీటీల బదిలీలు మాన్యువల్ విధానంలో నిర్వహించాలని కోరుతున్నారు. మాట తప్పి వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఆదేశిస్తుండడంపై అయ్యోర్లు, నాయకులు ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 8న డీఈవో కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చారు. మరికొంత మంది డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు ముచ్చెమటలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అయ్యోర్లకు కూటమి ప్రభుత్వం ముచ్చెమటలు పట్టిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బదిలీలు, ఉద్యోగోన్నతుల రూపంలో కక్ష సాధింపులకు పాల్పడుతోంది. ఈ బదిలీల కసరత్తులో చిత్ర విచిత్ర సమస్యలను సృష్టిస్తోంది. వాటిని పరిష్కరించకుండా ఏకపక్షంగా బదిలీల కసరత్తును ముందుకు సాగిస్తోంది.

ఇవిగో సమస్యలు

- ఉద్యోగోన్నతులు పొందలేక నష్టపోతున్న 610 జీవో బాధిత పీఈటీలకు న్యాయం చేయాలి.
- ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి.
- క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ ఖాళీలతో కలిపి ముందుగా ఇచ్చిన ఆప్షన్ మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలి.
- రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీల వెబ్ సైట్లో తప్పనిసరి బదిలీగా చూపడం అన్యాయం.
- తుది సీనియారిటీ జాబితా విడుదల చేయకుండా, ఉపాధ్యాయుల గ్రీవెన్స్ పరిష్కారం కాకుండానే ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడం బాధాకరం
- ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న ఖాళీలను కేటాయించకపోవడంతో తర్వాత సదరు ఖాళీలను పదోన్నతుల్లో చూపడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారు.
- కొన్ని ఖాళీలను సీనియర్ ఉపాధ్యాయులు ముందుగా బదిలీ కోసం ఎంపిక చేసుకున్నప్పటికీ వారికి కేటాయించకుండా జూనియర్లకు కేటాయించారు
- కొన్ని పాఠశాలల్లో ఒక పోస్టు ఖాళీగా ఉండగా సదరు ఖాళీ పోస్టును ఇద్దరు ఉపాధ్యాయులకు కేటాయించడం..
- ప్రాధాన్యత కేటగిరి ఉపాధ్యాయులు వారి ప్రాధాన్యతను రద్దు చేసుకుని జనరల్ కేటగిరి కింద ఆప్షన్ ఇవ్వగా సదరు ఎంపిక చేసుకున్న స్థానాలను వారికి కేటాయించకుండా జూనియర్లకు కేటాయించడం..

తీవ్రమైన అన్యాయం



ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుని కచ్చితమైన బదిలీలు పొందే టీచర్లకు తీవ్రమైన అన్యాయం జరిగింది. నమోదు చేసుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఇష్టానుసారంగా బదిలీలు చేశారు. గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ పరిధిలోని అన్ని సబ్జెక్టుల టీచర్లకు ఈ సమస్య ఉంది. విద్యాశాఖ మంత్రి చొరవ తీసుకుని మాకు న్యాయం చేయాలి.

– ఉజ్వల, స్కూల్ అసిస్టెంట్

యూనిట్లు ఉన్నచోటే బదిలీ చేయాలి



బదిలీల చట్టం ప్రకారం జిల్లాలో ఎన్‌సీసీ టీచర్లకు వాళ్ల యూనిట్లు ఉన్న చోటకే బదిలీ చేయాలి. లేదంటే అక్కడే కొనసాగించాలి. కానీ ఈ బదిలీల్లో ఆ విధంగా చేయకుండా ఇతర సీనియారిటీల్లో తక్కువ ఉన్న టీచర్లను బదిలీ చేశారు. వారి స్థానాల్లోకి వేరే వారిని నియమించారు.

– జనార్దన్, ఎన్‌సీసీ టీచర్

జూనియర్లకు మంచి ప్రాంతాలు



ఈ బదిలీల్లో జూనియర్లకు మంచి ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. మంచి పాయింట్లు ఉన్న సీనియర్లకు దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో కచ్చితంగా బదిలీ కావాల్సిన వారు 18 చూపించారు. వారికి సరిపోయే పోస్టులు లేవని ఒరిజనల్, క్లస్టర్ పోస్టులు కలుపుకుని చూపించారు. రీ కౌన్సిలింగ్ పెట్టాలి.

– రాధిక, స్కూల్ అసిస్టెంట్

పారదర్శకంగా లేదు



టీచర్ల బదిలీలకు నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ పారదర్శకంగా ఉంటుందనుకున్నాం. కానీ చాలా మంది టీచర్లకు బదిలీల్లో అన్యాయం జరిగింది. మొదటి ర్యాంకు ఉన్న టీచర్‌కు లాస్ట్‌లో నమోదు చేసుకున్న చోట పోస్టింగ్ ఇవ్వడం చాలా దారుణం. ప్రిఫరెన్షియల్ కేటగిరీ (తీవ్ర అనారోగ్యం)తో నమోదు చేసుకున్న వారికి దూర ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు.

-మణిగండన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, చిత్తూరు.

మాట తప్పడం అన్యాయం



రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సంఘ నాయకులతో నిర్వహించిన చర్చల్లో స్పష్టమైన హామీలిచ్చి ప్రస్తుతం మాట తప్పడం అన్యాయం. వెబ్ ఆప్షన్స్‌పై టీచర్లల్లో నమ్మకం పోయింది. తక్కువ మంది ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లకే వెబ్ ఆప్షన్స్‌లో అనేక సమస్యలున్నాయి. సమస్యల పరిష్కారం కోసం డీఈవో కార్యాలయం ముట్టడికి సిద్ధమయ్యాం.

– జీవీ.రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సీనియారిటీ ప్రకారం పోస్టింగ్స్ ఇవ్వలేదు



నేను గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్. సీనియారిటీ ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ప్రకారం పోస్టింగ్స్ ఇవ్వలేదు. మాకంటే తక్కువ ర్యాంకులున్న వారికి 20, 30 కి.మీ దూరంలో బదిలీలు చేశారు. పెద్దపంజాణి నుంచి సత్యవేడుకు బదిలీ చేశారు. ఇదెక్కడి న్యాయం.

– రెడ్డెప్ప, స్కూల్‌అసిస్టెంట్

షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపిక

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం, కల్లూరు జెడ్పీ హైస్కూలు నుంచి నలుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య శనివారం పేర్కొన్నారు. ఎంపికైన వారిలో విద్యార్థులు పఠాన్‌ఇర్షాద్ ఖాన్, సైదామసాత్, షేక్‌కస్నిహాజ్, షేక్ సబిహాఫిర్‌దౌస్ ఉన్నట్లు తెలిపారు. వీరు ఈనెల 9న చిత్తూరు జిల్లా కలెక్టరు, ఇన్‌చార్జ్ మంత్రి చేతుల మీదుగా రూ.20 వేలు నగదుతోపాటు ప్రశంసా పత్రం అందుకోనున్నట్టు వెల్లడించారు.

నేడు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడి

వెబ్ కౌన్సెలింగ్ వద్దు..మాన్యువల్‌గా చేపట్టాలని డిమాండ్

– వెల్లడించిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు



మాట్లాడుతున్న ఉద్యోగ సంఘ నేతలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ వద్దని..మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏపీయూఎస్ సంఘ రాష్ట్ర నేత బాలాజీ మాట్లాడుతూ ఇన్నాళ్ల పోరాటంలో తాము ఎదైతే డిమాండ్ చేశామో..ఆ డిమాండ్లకు విరుద్ధంగా ప్రస్తుతం కౌన్సెలింగ్ నడుస్తోందన్నారు. బదిలీలు, పదోన్నతులు, క్లస్టర్ల విభజన తదితర విషయాల్లో పారదర్శకత కనిపించడం లేదన్నారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. వెబ్ కౌన్సెలింగ్‌తో ఎస్జీటీలు ఇబ్బంది పడాల్సి వస్తోందని, ఈ కౌన్సెలింగ్‌ను మాన్యువల్ చేపట్టాలని రాష్ట్ర విద్యశాఖ కార్యదర్శి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు కూడా ఇందుకు అంగీకరించారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు అలా జరగడం లేదన్నారు. ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో ప్రధానంగా సీనియర్లకు అన్యాయం జరుగుతోందని, సాంకేతిక సమస్యలతో కౌన్సెలింగ్ మొత్తం గందరగోళంగా మారిందన్నారు. దీనిపై ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. రాష్ట్ర కార్యదర్శి జీవీ.రమణ మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేసి..మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తే సమస్యలు ఉండవన్నారు. ఈ వెబ్‌ఆప్షన్ వల్ల జూనియర్లు..సీనియర్లుగా, సీనియర్లు..జూనియర్లుగా అవుతారని వాపోయారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ వల్ల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యలను పరిష్కారానికి ఐక్యవేదిక పిలుపు మేరకు ఆదివారం జిల్లా విద్యశాఖ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఉద్యోగ సంఘ నేతలు గోవిందస్వామి, విజయభాస్కర్, మణికంఠ, నాగరాజు, నరేంద్రరెడ్డి, జయకాంత్, చంద్ర, కిషోర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు

బంగారుపాళెం: బాలికను వేధించిన యువకునిపై శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని తుంబపాళెం గ్రామంలో ఓ బాలికను అదే గ్రామానికి చెందిన మోహన్‌కుమారుడు వడ్డే దేగయ్య(29) కొంత కాలంగా వేధించేవాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు దేగయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి


మృతుడు దాదాపీర్

పలమనేరు: బక్రీద్ పండుగ వేళ ఓ మైనారిటీ వ్యక్తి ఇంట్లో విషాదం నెలకొంది. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు కాలనీకి చెందిన ఇబ్రహీం కుమారుడు దాదాపీర్(34) ఇంట్లో ఉరేసుకుని ఉండడంతో కుటుంబీకులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ఫోన్లు చోరీ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో శనివారం రెండు మొబైల్ ఫోన్లు చోరీకి గురైంది. మెడిసిన్ వార్డులో ఓ మహిళ మొబైల్ ఫోన్ చార్జింగ్ పెడుతుండగా..ఫోన్ మాయమైంది. అలాగే మరో మహిళ అదే వార్డులో డిశ్చార్జ్ పత్రం కోసం వెళ్లగా ఫోన్ కొట్టేశారు. పరారయ్యే సమయంలో పేషెంట్ అడెంటర్లు గుర్తించి చోరీదారులను పట్టుకునే ప్రయత్నం చేశారు. మొబైల్ ఫోన్లను వాళ్ల దగ్గర నుంచి లాక్కొని చితకబాదారు. ఆ తర్వాత ఆ ఇద్దరూ చోరీదారులను పోలీసులకు అప్పగించారు.

కరెంటు షాక్‌తో యువకుడి మృతి


మృతి చెందిన త్రినాథ్

తవణంపల్లె: మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె దళితవాడలో కరెంటు షాక్‌కు గురై యువకుడు మృతి చెందినట్లు తవణంపల్లె ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఎస్‌ఐ కథనం.. ఉత్తరబ్రాహ్మణపల్లె దళితవాడకు చెందిన బి.గోవిందయ్య కుమారుడు బి.జి.త్రినాథ్(25) తమ ఇంటి దగ్గర ఉన్న రేకుల షెడ్డులో పేపర్ ప్లేట్లు తయారు చేసే మిషన్‌ను రిపేరు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలింది. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే అతను మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి తండ్రి గోవిందయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అత్యాధునికంగా అలిపిరి టోల్‌ప్లాజా

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం అలిపిరి టోల్ ప్లాజా సెంటర్‌ను అత్యాధునిక తనిఖీ కేంద్రంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని టీటీడీ ఈఓ శ్యామల రావు ఆదేశించారు. శనివారం ఈఓ తన ఛాంబర్‌లో ఆయా విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తుల వాహనాలు, లగేజీని తక్కువ సమయంలో స్కాన్ చేయడం వల్ల సమయం ఆదా అవుతుందన్నారు. భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసి తిరుమల చేరుకునే సమయానికి లగేజీ సమాచారాన్ని భక్తులకు అందించే అంశంపై టీటీడీ ఐటీ విభాగం, విజిలెన్స్ కసరత్తు చేయాలన్నారు.

మధురం..విఫలం



- ధరలు పతనంతో రైతులు విలవిల
- తోతాపురి కొనుగోలుకు ఆసక్తి చూపని జ్యూస్‌ఫ్యాక్టరీ యజమానులు


మార్కెట్‌లో నిల్వ ఉన్న మామిడి

బంగారుపాళెం: మండలంలో మామిడి రైతులు విలవిల్లాడుతున్నారు. 70 శాతం మంది ఉద్యాన పంటైన మామిడి సాగుపై జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి బాగానే వచ్చినా ధరలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో దిగాలు చెందుతున్నారు. జిల్లాలో బంగారుపాళెం మార్కెట్ మామిడి ఎగుమతుల్లో ప్రథమ స్థానంలో ఉంది.

తెలుగు రాష్ట్రాలతో పాటుగా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి మామిడి కాయలు కొనుగోలు చేసి ఎగుమతి చేసేవారు. అదేవిధంగా గుజ్జు పరిశ్రమలకు చెందిన యజమానులు మామిడి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం వ్యాపారులు లేక మార్కెట్ వెలవెలబోతోంది.

తోతాపురి అమ్మడు పోయేనా?

రైతులు అత్యధికంగా తోతాపురి(బెంగళూర) మామిడిని సాగుచేస్తున్నారు. ఈ సారి పంట దిగుబడి బాగానే వచ్చినప్పటికీ ధర ఆశించిన స్థాయిలో లేదు. ప్రస్తుతం కిలో రూ.8 నుంచి రూ.9 వరకు పలుకుతోంది. తోతాపురికి కనీస గిట్టుబాటు ధర టన్నుకు రూ.25 వేలు ఇవ్వాలని రైతులు, రైతు సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దీంతో ప్రభుత్వం టన్ను రూ.12 వేలు నిర్ణయించింది. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరను అములు చేయాలని కలెక్టర్ జూస్ ఫ్యాక్టరీ యజమానులను ఆదేశించారు. బెంగళూర రకం మామిడి కొలుగోలు చేసేందుకు జూస్ ఫ్యాక్టరీ యజమానులు ఆసక్తి చూపనట్లు తెలుస్తోంది. తమిళనాడు, కర్ణాటక నుంచి తక్కువ ధరకే ఫ్యాక్టరీలకు రవాణా చేస్తుండడంతో ధర ఎక్కువ పెట్టి కొలుగోలు చేసేందుకు ఇష్టపడడం లేదు. గతంతో మార్కెట్ ప్రారంభంలో తోతాపురి (బెంగళూర)రకం ఆశాజనకంగా ఉండేదని, టన్ను రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు పలికేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం బెంగళూర రకం మామిడికి ధర ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే రైతులు ఇప్పటి వరకు తోతాపురి కాయలు కొతలు మొదలు పెట్ట లేదు.

గతంలో మామిడి ధరలు

రకం	టన్ను ధర
బెన్నీషా	రూ.80 వేలు నుంచి రూ.లక్ష
కాలేపాడు	రూ.60 వేల నుంచి రూ.70
ఇమామ్ పసంద్	రూ.1.2 లక్షల నుంచి రూ.1.5 లక్షల వరకు
మల్‌గూబ	రూ.లక్ష వరకు
నాటీ రకాలు	రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు

ఈ ఏడాది తగ్గిన మామిడి ధరలు

రకం	టన్ను ధర
బెన్నీషా	రూ.10 వేల నుంచి రూ.35 వేల వరకు
కాలేపాడు	రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు
మల్లిక	రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు
ఖాదర్	రూ.23 వేల నుంచి రూ.18 వేల వరకు తగ్గించేశారు
పులేరా	రూ.12 నుంచి రూ.6కు పడిపోయింది
నాటీ రకాలు	కిలో రూ.4 లెక్కన విక్రయిస్తున్నారు

ఏనుగుల బీభత్సం

పలమనేరు: మండలంలోని ఊసరపెంటలో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. పలువురు రైతులకు చెందిన మామిడితోటల్లోకి ప్రవేశించి ధ్వంసం చేసింది. ముగ్గురు రైతులకు చెందిన పంటను నాశనం చేసింది. దీంతో సుమారు రూ.20వేల దాకా నష్టం వాటిల్లింది. అడవిలోని ఏనుగులు రైతుల పంట పొలాల్లోకి రాకుండా ప్రభుత్వం కుంకీ ఏనుగుల ప్రాజెక్టును ఇక్కడ ఏర్పాటు చేసినా ఇంకా ఫలితం రావడం లేదు. దెబ్బతిన్న పంటలను స్థానిక అటవీశాఖ సిబ్బంది శనివారం పరిశీలించారు.

9 నుంచి టీటీడీ కళాశాలల్లో అడ్మిషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర (ఎస్వీ), శ్రీపద్మావతి మహిళా (ఎస్పీడబ్ల్యూ) జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 9వ తేదీ నుంచి తొలివిడత అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించనున్నారు. ఆ మేరకు ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు తెలిపారు. ఎస్వీ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్, తెలుగు, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్వీ జేసీలో 792 సీట్లకు దాదాపు 5,200 మంది, ఎస్పీడబ్ల్యూ జేసీలో 968సీట్లకు దాదాపు 9వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేశారనిపేర్కొన్నారు. వీరికి 9వ తేదీ నుంచి తొలివిడత అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తారని, మిగిలిన సీట్లకు మలివిడత అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించి భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అడ్మిషన్లు పొందిన ఆర్ట్స్ విద్యార్థులు రూ.4,400, సైన్సు విద్యార్థులు రూ.5,350 ఫీజు చెల్లించాలని చెప్పారు. హాస్టల్‌లో సీటు పొందిన వారు హాస్టల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒరిజినల్ టీసీతో పాటు వెబ్ సైట్లో అప్‌లోడ్ చేసిన అన్ని ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలన్నారు.

చిత్తూరోళ్లు బస్సు ఎక్కొద్దు

- తమిళనాడు వేలూరు బస్టాండులో చిత్తూరు ప్రయాణికులకు అవమానం
- ఆర్టీసీ బస్సుల్లో తిరుపతి, చిత్తూరు ప్రయాణికులను ఎక్కించుకోని వైనం


వేలూరు బస్టాండులో చిత్తూరు బస్సు

చిత్తూరు రూరల్(కాణిపాకం): తమిళనాడులోని వేలూరు బస్టాండులో శుక్రవారం అర్ధరాత్రి చిత్తూరు ప్రయాణికులకు అవమానం చోటు చేసుకుంటోంది. రాత్రి పూట తిరుపతి-వేలూరు బస్సుల్లో చిత్తూరు ప్రయాణికులను వేలూరు బస్టాండులో ఎక్కించలేదు. చాలామంది చెన్నై, బెంగళూరు నుంచి వేలూరు మీదుగా చిత్తూరుకు వస్తుంటారు. ఈ క్రమంలో చిత్తూరుకు వచ్చే ప్రయాణికులను ఆర్టీసీ బస్సు కండక్టర్లు, డ్రైవర్లు అక్కడ ఛీకొడుతున్నారు. వాళ్లను బస్సు ఎక్కినివ్వడం లేదు. బస్సు దిగేయండి అంటూ వారిని నిర్దాక్షిణ్యంగా దింపేస్తున్నారు. దీంతో ప్రయాణికులు, ఆర్టీసీ కార్మికుల మధ్య గొడవ చోటు చేసుకుంటోంది. ఇదే మాదిరిగా తిరుపతి ప్రయాణికులను కూడా ఎక్కనివ్వకుండా ఓ బస్సు కండక్టర్ ఇబ్బందులకు గురిచేశాడు. తిరుమలకు వెళ్లే బస్సులో మాత్రమే ఎక్కనిచ్చి.. మిగిలిన వాళ్లను ఎక్కించుకోలేదు. దీంతో గంటల తరబడి బస్టాండులో నిరీక్షించాల్సి వచ్చింది. ఈ ఏడాది కాలంలో వేలూరు బస్టాండులో చిత్తూరు వాళ్లను ఎక్కించడం లేదని పలుమార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని చిత్తూరు వాసులు మండిపడుతున్నారు. ఆదాయం పేరుతో కొందరు ఆర్టీసీ ఉద్యోగులు ఇలా అత్యుత్సాహం చేస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలానే కొనసాగితే చిత్తూరు మీదుగా వేలూరుకు ఆర్టీసీ బస్సులను తిరగనివ్వమని స్పష్టం చేస్తున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్


పుస్తకాన్ని అందజేస్తున్న నల్లాని రాజేశ్వరి

చంద్రగిరి : రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ శనివారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త నల్లాని రాజేశ్వరి, మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసి సత్కరించి, సాధికారత పుస్తకాన్ని అందజేశారు. అనంతరం ప్రతి మహిళా సాధికారత దిశగా ముందుగా సాగేలా చేయూతనందించాలని కోరారు.

ఒకే ఒక్కడు

గాంధీ స్వప్నం.. జగనన్న సంకల్పం


చౌడేపల్లి మండలం, కొండామర్రి గ్రామ సచివాలయ భవనం

జిల్లాలో సచివాలయాల వివరాలు

నియోజకవర్గం	సచివాలయ భవనాలు	ఖర్చు చేసిన మొత్తం (రూ.కోట్లల్లో)
చిత్తూరు	26	9.45
పలమనేరు	94	35.69
పూతలపట్టు	100	36.35
గంగాధరనెల్లూరు	88	31.74
కుప్పం	81	24.57
పుంగనూరు	99	42.16
నగరి	58	21.46
మొత్తం	546	201.42

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామ స్వరాజ్యం జాతిపిత మహాత్మా గాంధీజీ కల. ఆయన కలలను 2019కి ముందు వరకు ఎవ్వరూ నిజం చేయలేకపోయారు. 2019లో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దాన్ని నిజం చేసి చూపించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలను నెలకొల్పారు. అనేక రకాల సేవలు ప్రజల గుమ్మం ముందే అందించి జాతిపిత కలలు సాకారం చేశారు. వేల కోట్లను ఖర్చు చేసి జిల్లా వ్యాప్తంగా శాశ్వత గ్రామ సచివాలయ భవనాలను నిర్మించారు. దేశంలో అనేక రాజకీయ పార్టీలు వందలాది మంది గొప్ప నాయకులు ఉన్నా ఏ నాయకుడు తీసుకోని ఈ నిర్ణయాన్ని గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసి ఒకే ఒక్కడుగా ప్రజల గుండెల్లో నిలిచారు.

భక్తుల సౌకర్యార్థమే అలిపిరికి టోకెన్ల జారీ కేంద్రం

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : శ్రీవారి మెట్టు మార్గం ద్వారా కాలినడకన వెళ్లే దివ్యదర్శనం భక్తుల సౌకర్యార్థం దివ్యదర్శనం టోకెన్ల జారీ కౌంటర్లను అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చినట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఈఓ భూదేవి కాంప్లెక్స్, అలిపిరి టోల్ ప్లాజాలను పరిశీలించారు. శ్రీవారి మెట్టు వద్ద భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారనే ఫిర్యాదులు రావడంతో తాత్కాలికంగా శుక్రవారం సాయంత్రం నుంచి మార్చామన్నారు.

శ్రీవారి మెట్టు మార్గం ద్వారా కాలినడకన వెళ్లే భక్తులకు అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో రోజుకు సరాసరి 5 వేల టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. శ్రీనివాస మంగాపురంలో టోకెన్లు జారీ చేసేందుకు ఆర్కియాలజీ శాఖ అనుమతి రాగానే అక్కడ టోకెన్లు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీ అండ్ ఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలకు బాబు సృష్టించిన సంపద అప్పులే


పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ డెప్యూటీ సీఎం కె.నారాయణస్వామి

– మాజీ డెప్యూటీ సీఎం ధ్వజం

పాలసముద్రం : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో ప్రజలకు సృష్టించిన సంపద అప్పులేనని మాజీ డెప్యూటీ సీఎం నారాయణ స్వామి ధ్వజమెత్తారు. శనివారం గంగమ్మంబపురం గ్రామంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో ఓ కళాశాలలో బీటెక్ విద్యార్థి జేమ్స్ అనే దళిత యువకుడిని కులం పేరుతో అదే కళాశాలలో చదివే జూనియర్ విద్యార్థి యశ్వంత్ నాయుడు, రౌడీషీటర్లతో కలసి కొట్టడమే కాకుండా మూత్రం పోసి తాగించారని గుర్తుచేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఆర్భాటం చేసి అధికారంలోకి వచ్చాక ప్రజలను నిలువునా ముంచేశారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు రెండింతలు ఇస్తామంటూ ఆయన చేసిన హడావుడిని ఎవరూ మరిచిపోయి ఉండరన్నారు. రాష్ట్రంలో 18 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇసుక, మట్టి, మద్యం ఆదాయం ప్రభుత్వం నుంచి రాజకీయ నాయకుల జేబుల్లోకి పోతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని వేల మంది రోడ్డున పడ్డారని వాపోయారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు కడుపు కోత మిగిల్చారని తెలిపారు. కూటమి ప్రభుతం ఏర్పడిన ఏడాదిలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ మాత్రమే వచ్చిందని, అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒకే సారి రెండున్నర లక్షల ఉద్యోగాలిచ్చిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని గుర్తుచేశారు. కక్ష సాధింపులు మానుకుని రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు చందురాజు, కార్వేటినగరం మండల కన్వీనర్ శేఖర్‌రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సుందరరాజు, షణ్ముగరెడ్డి, కృష్ణయ్య, నరసింహ నాయుడు, గోపాల్, రవిరెడ్డి, చిన్నపయ్యన్, లక్ష్మణన్, తిరుమళ, గోపి, పయణి, బాబు, తిరుమాల్, కే.పయణి, కేశవన్, మణి, మనోహన్, వాసు, షణ్ముగరెడ్డి, సుబ్రమణ్యరాజు, చిన్నప్పరాజు పాల్గొన్నారు.